కథానిక

# కల(హ)భాషిణి

అంగర సూర్యారావు

కళా పూర్ణోదయంలోని కలభాషిణిపాత్ర పద్మ రాజును అద్భుతంగా ఆకర్షించింది. అదిమొదలు అతను దారినిపోతున్నా బీచిలో కూర్చున్నా ఆడవాళ్ళ మాటలను ఆత్రుతగా వినడం ప్రారంభించాడు. ఒకో స్త్రీమాట విపంచిమీటినట్లు అతని హృదయాన్ని తట్టి పలకరిస్తే, "నిజంగా యీమె కలభాషిణి" అనుకోవడం సాగించాడు. ఆడవాళ్లు దారిలో ఎక్కడైనా కనిపిస్తే తలవంచుకుపోయే పద్మరాజు యీనాడు ఆడది కనిపించడమే తడవుగా ఆమెకేసి చూడ్డం, ఒక్కక్షణం ఆగి ఆమె మాటల్ని వినడం ప్రారంభించాడంటే కలభాషిణి పాత్ర అతనిమీద తన ప్రభావాన్ని యెంతగా చూపించి వుండాలి!

యీ నవభావోదయ శుభసమయంలో పద్మరాజుకు "విద్య"తో వివాహం జరిగిపోయింది. రిటైర్డు ఆఫీసరుగారి అమ్మాయి విద్య. చూపులకు చక్కనిది. మృదువైన కంఠస్వరం గలది. కాని పెళ్ళికిముందు ఆమెను చూడ్డానికి కూడా కనీసం ఆమె కంఠస్వరం వినడానికి కూడా అతనికి అవకాశం కలుగలేదు. విద్యవంటి గొప్పయింటి బిడ్డను పద్మరాజువంటి సామాన్య గృహస్థుకు యివ్వడమే గొప్ప ఉదారస్వభావంతో కూడిన విషయం, ఆ పరిస్థితులలో పెళ్ళికిముందు అతనికి చూపించడం శుద్ధ అనవసరం. కారణం డబ్బులేనివాడు ప్రతి విషయాన్ని సర్దుకుపోవడం నేర్చుకోవాలిగనక!

వసంతోదయంలో —కోకిలలు కూసే రోజులలో—విద్యతో కొత్తగా సంసారంలో అడుగు పెట్టాడు పద్మరాజు.

విద్య యింట్లో అడుగుపెట్టగానే "ఆకలి వేస్తోంది. కొంచెం టిఫిన్ చేసి కాఫీ పెట్టమని వంటమనిషితో చెప్పండి" అంది.

"ఈ యింట్లో వంటమనుషులెవరూలేరు. ఈ యింట్లోనేకాదు. నాకు తెలివున్నంతవరకూ నా తోటిగుమస్తాలెవరి ఇళ్ళలోనూ వంటమనుషులు లేరు." అన్నాడు సవినయంగా.

"అయితే ఈయింట్లో వంటఎవరుచెయ్యాలి?"

"గృహిణి"

"అంటే నేననా మీ ఉద్దేశం. నాకు వంట చెయ్యడం చేతకాదు."

"నాకు చేతనవును. రెండు రోజులు నేనే చేసి చూపిస్తాను" వాళ్ల దాంపత్యం జీవితంలోని తొలిసంభాషణ ఇంత మృదుమధురంగా సాగింది.

ఒకరోజు పద్మరాజు ఆఫీసునుంచి రావడం చాలా ఆలస్యమయింది. అతని ముఖంలో అలసటా చిరాకూ కనిపిస్తున్నాయ్. అతనిని చూడగానే విద్య చివాలునలేచి వంటయింట్లోకివెళ్లింది. పద్మరాజు పడకకుర్చీలో శరీరాన్ని వాల్చి తను ఆరోజు ఆఫీసులో పడిన శ్రమను మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ సమయంలో వంటయింట్లో తెపాళాలు గిన్నెలు హెచ్చుస్థాయిలో చప్పుడవడం ప్రారంభమయ్యింది. విశ్రాంతిని కోరుతున్న అతని మనసుకు యీ ఘటన మరింత చిరాకును కలిగించింది. బట్టలుమార్చి వంటగదిలోకి వెళ్లాడు — మౌనంగానే పనులన్నీ జరిగిపోయినయ్. భోజనం అయినతరవాత విద్య ఒక పుస్తకంతీసి చదువుతూ కూర్చుంది. విద్య తనతో సంతోషంగామాట్లాడితనశ్రమనంతాపొగొడుతుందని అనుకున్న పద్మరాజుకు ఆశాభంగం కలిగింది. ఆమెను నెమ్మదిగా ప్రశ్నించాడు. "కోపంగావున్నావేం విద్యా?" ఆమె చదువుతున్న పుస్తకంలోంచి తల పైకి ఎత్తి "నాకు కోపంవుంటే చెల్లుతుందా? కోరికవుంటే చెల్లుతుందా? ఉదయంపోయి ఎప్పుడో రాత్రివస్తారు. నా మంచీ చెడ్డ మీరేమైనా ఆలోచిస్తేగా!" అనది తీక్షణంగా.

"ఇటుచూడు విద్యా! నాకుమాత్రం రోజంతా యిల్లువిడిచిపెట్టివుండాలనివుంటుందా? ఆఫీసులో పని ఎక్కువగావుంటే ఒకోరోజు బాగా ఆలస్యమౌతుంది. ఆమాత్రం దానికి కోపగిస్తే ఎలా?"

"యిన్ని వందలరూపాయలజీతానికి పనికూడా

ఎక్కువటు. హాయిగా ఏ స్నేహితులతోనో షికార్లు చేసివస్తారు. యింట్లో మనిషి యేమైపోతే నేం? ఎప్పుడూ వంటచేసి ఎరుగనిదానిచేత వంట కూడా చేయిస్తున్నారు." తన పుట్టింటిలో సుఖం జ్ఞాపకంవచ్చేసరికి విద్యకు కళ్ళలో నీళ్లు తిరిగినై. అతను తిరిగి మాట్లాడలేకపోయాడు.

పద్మరాజు ఒకరోజు సాయంత్రం ఆరుగంటలకు ఆఫీసునుంచి ఇంటికిబయలుదేరాడు. దారిలో ఒక మేడమీదినుంచి పాట వినిపిస్తోంది. అది స్త్రీ కంఠస్వరం. ఆ పాట ఎంతో శ్రావ్యంగా వుంది. అతనికాళ్లు రెండూ నడవడానికి నిరాకరించినై. అతను అక్కడ ఆగిపోవడంచూసి ఒక అపరిచిత వ్యక్తి అతనిదగ్గరకువచ్చి 'బాబుగారూ! లోపలికివచ్చి పాటవినండి" అని వినయంగా ఆహ్వానించాడు. పద్మరాజు మనస్సు ఆ పాటలో లీనమైపోయింది. పరధ్యానంగా ఆ వ్యక్తితో మేడమీదికి దారితీశాడు. హాలులో ఒక స్త్రీ కూర్చుని పాడుతోంది. ఆమెకు వయస్సు 20 సంవత్సరాలు వుండవచ్చు. సినిమాతారలతీరులో అలంకరించుకొంది. ఒక యువకుడు తబలా వాయిస్తున్నాడు. మరో యువకుడు హార్మోనియంవాయిస్తున్నాడు. యిద్దరు పెద్దమనుషులు కుర్చీలో కూర్చున్నారు. పద్మరాజును ఆమె రూపం ఆకర్షించలేదుకాని ఆమె కంఠస్వరం ఆకర్షించింది. ఆ వ్యక్తి అతనిని కుర్చీలోకూర్చోబెట్టి బయటకువెళ్లిపోయాడు. తన జీవితంలో ఎన్నడూ ఎరుగని హాయిని పద్మరాజు ఆ రోజుఅనుభవించాడు. అతనిమనసంతా పాటలోనే లగ్నమైపోయింది. తను ఒక ఆఫీసులో గుమస్తా అనీ, తనకు ఒక భార్యవుందనీ, తన బ్రతుకు చాలా భారమైనదని అతనికి అప్పుడు జ్ఞాపకంలేదు. పాట పూర్తి అయింది. అతను ఐహిక ప్రపంచంలోకి వచ్చాడు. టైము రాత్రి 9 గంటలు దాటింది. నిద్రనుంచి మేల్కొన్నవాడిలా తొందరగా లేచాడు. ఆ వ్యక్తి అతనిని సమీపించి "బాబుగారూ..." అన్నాడు. పద్మరాజు తన జేబులోంచి వారంరోజులవరకూ సరిపోవలసిన ఒకే ఒక పదిరూపాయలనోటును బయటకు తీసి వాడిచేతిలో పెట్టి వీధిలోకి వచ్చాడు. చాలా రాత్రి గడిచింది. భయపడుతూ యింట్లో అడుగు పెట్టాడు. అతని చూడగానే విద్య చదువుతున్న పుస్తకాన్ని మూసి అతనివైపు తీక్షణంగా చూసింది.

"ఇంత ఆలస్యం యెందుకయింది?"

"నిజమే! ఇవేళ ఆలస్యమయింది" అన్నాడు నెమ్మదిగా

"వ్యవహారం సానికొంపలలో దూరేవరకూ వచ్చిందన్న మాట!"

ఈ మాటలకు పద్మరాజు ఒక్కసారి ఆశ్చర్యంపోయాడు. యీ విషయం యీమె కెలా తెలిసింది?

"మాట్లాడరేం? మీరు వెళ్ళిన యిల్లు ఎవరిది? నేను స్వయంగా నా కళ్ళతో చూశాను. సినిమాకు వెళ్ళే దారిలో మీరు ఎవరింట్లోనో దూరుతూవుండడం కమల నాకు చూపించింది. ఆమె ముందు నేను తలఎత్తుకోలేకపోయాను. నా మనసంతా అవమానంతో బాధపడింది. సినిమా ఎలా చూశానో నాకే తెలీదు."

పద్మరాజుకు జరిగిన విషయం బోధపడింది. అతను నవ్వుతూ అన్నాడు. "లేదు విద్యా. నువ్వు తప్పుగా ఊహిస్తున్నావ్. నాకు చిన్నప్పటినుంచి పాటంటే ఎక్కువ యిష్టం. ఆ యింట్లోకి వెళ్ళి పాట వినివచ్చాను. అంతే!"

"చేసిన ఘనకార్యానికి తోడు అబద్ధాలు కూడానా? పూరుకోండి. మీకు ఎంతకాలంనుంచి యిలాంటి దుర్గుణాలు వున్నాయో! నేను తెలియక మోసపోయాను. నేను యిక యీ యింట్లో ఒక క్షణం వుండను. రేపు ఉదయం నన్ను బండి ఎక్కించండి" అంది కోపంగా. కేవలం కొన్ని నెలల పరిచయంతోనే తన ప్రవర్తన మీదతీర్పుయిచ్చిన ఆమెపై పద్మరాజుకు కోపమూ జాలీ కూడా కలిగినై.

అతను ఆకాశంలోకి చూస్తూ కొందరు మనుషుల ఆశయాలు పూర్తిగా ఎందుకు విఫలమౌతాయా అని ఆలోచిస్తున్నాడు...

"ఒకానొకప్పుడు సినిమాలలో నేను పాటపాడుతూ కథానాయికల్ని చెట్లచుట్టూ పరిగెత్తించేవాడిని" అన్నాడు సినిమానటుడు మోతీలాల్. ఇప్పుడా నాయికలు చెట్లెక్కికూర్చున్నారు.—శంకర్స్ వీక్లీ